ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల

జిల్లా వార్తలు

5

ఆదివారం 15 డిసెంబరు 2024

అత్యవసరానికి అవస్థలు

- మండలానికి మంజూరు కాని 108 వాహనం
- రోగులకు తప్పని తిప్పలు
- ప్రైవేటు వాహనాలే దిక్కు

6



గుట్టల మాటున పాండవుల చరిత్ర

కొండాపూర్-నర్సాపూర్ గ్రామాల మధ్య గుట్టలు

ధర్మరాజు, రచ్చగుట్టలుగా వాడుకలో...

దృష్టి సారించని పురావస్తు శాఖ

7



కొండాపూర్ శివారులో ధర్మరాజుల గుట్ట

66 ఎస్టీ ఆవాసాలకు త్రిఫేజ్ విద్యుత్ సరఫరా

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ మంచిర్యాల సర్కిల్ పరిధిలో ఎస్టీఎస్డీఎఫ్ నిధుల కింద ఇప్పటి వరకు 66 ఎస్టీ ఆవాసాలకు త్రిఫేజ్ విద్యుత్ సరఫరా అందించామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిపాదించిన 72 ఎస్టీ ఆవాసాలకు 66 పూర్తి చేశామని, మిగతా వాటికి అటవీ శాఖ నుంచి ఆమోదం పొందాల్సి ఉందన్నారు. గిరిజన పల్లెల్లో వంద శాతం విద్యుద్దీకరణ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన పల్లెలకు విద్యుత్ అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. విద్యుత్‌లైన్‌లు వేయలేని చోట సోలార్ విద్యుత్ అందుబాటులో ఉందని తెలిపారు.

నస్పూర్‌లో కోర్టు స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారులు

నస్పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లో పట్టణంలో జిల్లా కోర్టుకు కేటాయించిన స్థలాన్ని శనివారం సాయంత్రం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్ రెడ్డి, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి సంపత్‌లు పరిశీలించారు. నస్పూర్ శివారులోని 42 సర్వే నంబరులో కోర్టుకు కేటాయించిన ఐదు ఎకరాల భూమి వివరాలను తహసీల్దార్ శ్రీనివాస్ న్యాయమూర్తులకు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతు పొలం బాట.. కొంగల ఆహార వేట..



యాసంగి సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు... నెల్కివెంకటాపూర్ గ్రామ సమీపంలో పొలంలో రైతు ట్రాక్టర్లతో దున్నుతుండగా భూమిలో నుంచి బయటపడే పురుగులను తినడానికి పెద్దసంఖ్యలో కొంగలు వాలాయి. కొంగలు ట్రాక్టర్ చుట్టూ గుంపులుగుంపులుగా తిరుగుతూ రైతు నేస్తాలు సందడి చేశాయి.

- దండేపల్లి

ఊపందుకున్న పనులు

- అన్ని హంగులతో శ్మశాన వాటిక నిర్మాణం
- రూ. 4 కోట్లతో నాలుగు ఎకరాల్లో
- ఒకేసారి ఎనిమిది దహన సంస్కారాలకు అవకాశం



నిర్మాణంలో ఉన్న శ్మశాన వాటిక ప్రహరీ, ఇతర నిర్మాణాలు

మంచిర్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్మించ తలపెట్టిన హిందూ శ్మశాన వాటిక పనులు వేగం పుంజుకున్నాయి. గోదావరి సమీపంలోని భూదాన్ యజ్ఞ బోర్డు భూముల్లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 కోట్ల అంచనాతో నిర్మాణం చేపట్టగా, అక్టోబర్ 3న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. శ్మశాన వాటికకు ప్రహరీ, ఇతర నిర్మాణ పనులు జరుగుతుండగా ప్రజల సౌకర్యార్థం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. శ్మశాన వాటిక నిర్మాణం పూర్తయితే ఇంతకాలం ప్రజలు దహన సంస్కారాలకు పడుతున్న బాధలు తీరే అవకాశాలు ఉన్నాయి.

శ్మశాన వాటికలో వసతులు ఇలా..

హిందూ సాంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలకు అవసరమైన అని వసతులు కల్పించే విధంగా నిర్మాణాన్ని చేపట్టారు. ఒకేసారి ఎనిమిది మృతదేహాలను దహనం చేసే విధంగా ప్లాట్‌ఫాం నిర్మాణం చేపడుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు వీక్షించేలా గ్యాలరీ ఏర్పాటు చేయనున్నారు. బాత్రూంలు, టాయిలెట్ల నిర్మాణం చేపడుతున్నారు. శ్మశాన వాటిక మధ్యలో గ్రీనరీతో కూడిన పార్క్‌ను నిర్మిస్తున్నారు. శ్మశాన వాటిక ఆవరణలో 20 ఫీట్ల ఎత్తైన శివ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్లాట్‌ఫాంను నిర్మిస్తున్నారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం గోదావరి రోడ్డు నుంచి 30 మీటర్ల మేర ఏర్పాట్లు చేస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

కిరాయిదారులకు ప్రత్యేక వసతి..

ఉపాధి కోసం జిల్లా కేంద్రానికి వచ్చి కిరాయికి ఉంటున్న స్థానికేతరుల కోసం శ్మశాన వాటికలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా 7వ పేజీలో

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తదితరులు

బెల్లంపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శనివారం నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీయేనని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేసి మండల కమిటీ ఎన్నికకు సిద్ధంగా ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కృష్ణమూర్తి, కోకన్వీనర్ చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సంతోష్, బద్దం లింగారెడ్డి, తిరుపతి, కళ్యాణి, పాల్గొన్నారు.

బతుకమ్మ ఆటలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి ఐదవ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లను సాధన కోసం ఆందోళన ఉధృతం చేస్తామని ఎస్ఎస్ఏ-జెఏసీ జిల్లా అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి రాజన్న తెలిపారు. ఐదవ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు కోలాటం, బతుకమ్మ ఆట ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్టీయుటీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాపన్నలు మద్దతు తెలిపారు.

జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2 పరీక్ష నేపథ్యంలో ఆది, సోమవారాల్లో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. ప్రజలు, యువకులు పరీక్ష కేంద్రాల వద్ద గుమిగూడవద్దన్నారు.

వరికల్లాల సందర్శన

కన్నెపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాలిగాం గ్రామంలోని బస్టాండ్ వద్ద వరి కల్లాలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం సందర్శించారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఎరువుల, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. టార్పాలిన్ కవర్లను, రైతులకు ఉచితంగా ఇవ్వాలన్నారు.

లోక్‌అదాలత్‌లో 5,500 కేసుల పరిష్కారం



చెన్నూర్‌లో లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించడం జరిగిందని, ఏడు బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. 22 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారం కాగా, 51 బ్యాంకు కేసుల్లో రూ.33 లక్షలు రికవరీ అయ్యాయన్నారు. 5,500 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. మంచిర్యాల సెకండ్ డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అధారిటి జడ్జి అర్పిత మారంరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సంపత్, ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియన్ మెజిస్ట్రేట్ ఉపనిషద్వానా, సెకండ్ అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ నిరోష తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో 470 కేసులు పరిష్కారమయ్యాయని చెన్నూరు మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి తెలిపారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో బ్యాంకు, సివిల్, క్రిమినల్ కేసులు రాజీపడడం జరిగిందన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 227 కేసులు నమోదు కాగా జరిమానా విధించడం ద్వారా రూ. 4.54 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

లక్సెట్టిపేటరూరల్, (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లో కేసులు శాశ్వత పరిష్కారం అవుతాయని జూనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా కేసులు రాజీ పడితే రెండు వైపుల మేలు జరుగుతుందన్నారు. సీఐ నరేందర్, ఎస్ఐలు సతీష్, రాజవర్ధన్, ఉదయ్‌కిరణ్, సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ సత్యం, పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముఖేష్ అన్నారు. సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, సీఐలు అఫ్జలుద్దీన్, దేవయ్య, కుమారస్వామి, ఎస్ఐలు మహేందర్, రమేష్‌ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బేస్ క్యాంపు సిబ్బందికి దుప్పట్లు పంపిణీ

జన్నారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న బేస్ క్యాంపు సిబ్బందికి ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలికాలంలో విధులు నిర్వహిస్తూ అటవీ, జంతు సంరక్షణకు పాటు పడుతున్న సిబ్బందికి తమ వంతు సహాయంగా దుప్పట్లు పంపిణీ చేశారు. అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించేందుకే కామన్ మెనూ



కామన్ మెనూ ఫ్లెక్సీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

లక్సెట్టిపేటరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచి కామన్ మెనూను ప్రారంభించిందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. లక్సెట్టిపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి గురుకులాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు హాస్టళ్లలోని విద్యార్థుల వద్దకు వచ్చేటప్పుడు ఇంటి నుంచి, హోటళ్ల నుంచి ఎలాంటి ఆహారం తీసుకురావద్దని సూచించారు. పిల్లలు గురుకులాల్లో వండిన ఆహారం తినేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. నియోజకవర్గంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు స్పష్టం చేశారు. డీఆర్‌డీవో సంజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, సీఐ నరేందర్, ఎస్ఐ సతీష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఆసుపత్రి వైద్యులు ఆకుల శ్రీనివాస్, సురేష్, పవిత్ర, కృష్ణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కానరాని అభివృద్ధి

విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి అగుపించడం లేదని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.164 కోట్లతో నిర్మించ తలపెట్టిన గోదావరిపై అంతర్గాం వంతెన ఊసే లేదని, నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఐబీ గెస్ట్‌హౌజ్‌ను లేకుండా చేశాడన్నారు. పత్తిన్‌పల్లి లిఫ్ట్ చేపడితే దాదాపు 10 వేల ఎకరాలకు సాగు నీరు అందేదని, దానికి అతీగతి లేదన్నారు. మూడు మున్సిపాలిటీలకు ఒక్కో మున్సిపాలిటీకి రూ. 25 కోట్ల చొప్పున, ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున నియోజకవర్గానికి మంజూరైన రూ.6.60 కోట్లు నిధులు వెనక్కిపోవడానికి ఎమ్మెల్యే కారణమన్నారు. చిన్నా చితకా పనులను చేపడుతూ పెద్ద మొత్తంలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చెప్పుకుంటున్నాడన్నారు. మంచిర్యాల ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా కొట్లాటలు జరుగుతున్నాయని, తప్పు చేయని వారిని చేసినట్లు చిత్రీకరిస్తున్నారన్నారు. భూదాన్ భూములను తాము కాపాడితే ప్రైవేటు వ్యక్తులకు రోడ్డు కోసం రోడ్లు వేసి లైట్లు పెట్టించాడని పేర్కొన్నారు. ప్రజల ఇండ్ల ముందు రోడ్లు వేయని ఎమ్మెల్యే ప్రైవేటు వ్యక్తుల కోసం రోడ్లు వేసే ప్రతిపాదన ఎలా చేస్తారని ప్రశ్నించారు. వ్యాపారులను ఇబ్బందులు పెట్టాలని మార్కెట్‌లో రోడ్డు విస్తరణ చేపడుతున్నారని, వ్యాపారులు ఎమ్మెల్యేకు ఓట్లు వేయలేదని వారిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు.. ప్రతీ నెల పింఛన్‌లు ఇవ్వడం లేదని, దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. తనపై అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, సుపారీ ప్రయత్నం మేము చేయలేదని, గంజాయి, డ్రగ్స్‌తో యువతను తప్పుదారి పట్టించే ఆలోచనలు చేయలేదని పేర్కొన్నారు. తాను డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.12.56 కోట్లు నియోజకవర్గానికి కేటాయిస్తే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం 23-02-2024న రద్దు చేసిందని, ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కోటాలోని సీడీపీ నిధులను 2023-24 సంవత్సరం కింద రూ.268.50 లక్షలను అప్రూవ్ చేయించానని, అయినా ఆ పనులు ఎందుకు మొదలు పెట్టలేదో ఎమ్మెల్యే చెప్పాలన్నారు. నేను ఎమ్మెల్యేగా, ప్రేంసాగర్‌రావు ఎమ్మెల్సీగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన విషయాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, లేదంటే ప్రేంసాగర్‌రావు చెప్పిన విషయాన్ని అబద్దాలేనని ప్రజాక్షేత్రంలో ఒప్పుకోవాలన్నారు. పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేష్, నాయకులు తోట తిరుపతి, శ్రీనివాస్, తిరుపతి, మహ్మద్ తాజుద్దీన్, రవీందర్, శంకర్,పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

లక్షెట్టిపేటరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటిక్యాలకు చెందిన చుంచు లింగయ్య (60) అక్కడికక్కడే మృతిచెందాడు. లింగయ్య ద్విచక్ర వాహనంపై లక్షెట్టిపేట మార్కెట్‌కు వెళ్తుండగా మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం పట్టుకున్నట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఎదుట అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న జావీద్, ఎండీ సల్మాన్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని తనిఖీ చేయగా 80 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయిని స్వాధీన పర్చుకుని నిందితులను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, రవాణా చేసిన చర్యలుంటాయన్నారు. ఎస్‌ఐ మహేందర్ పాల్గొన్నారు.

ఆరు క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం, ఆటో ట్రాలీ పోలీసులు

నస్పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీసీసీ కార్నర్ వద్ద అక్రమంగా ఆటో ట్రాలీలో తరలిస్తున్న ఆరు క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని శనివారం ఉదయం టాస్క్‌ఫోర్స్ పోలీస్ బృందం పట్టుకుంది. మంచిర్యాల నుంచి చెన్నూరు వైపు ఆరు క్వింటాళ్ళ రేషన్ బియ్యంతో వెళుతున్న ఆటో ట్రాలీని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై లచ్చన్న తెలిపారు. ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన వానరాసి అశోక్‌ను అదుపులోకి తీసుకుని ఆరు క్వింటాళ్ళ బియ్యంతో పాటు ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ దాదాపు రూ.18 వేలు ఉంటుందన్నారు. తదుపరి విచారణకు ఎస్సై సుగుణాకర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి పోలీసులు 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జూరుకు చెందిన నౌషద్ అనే వ్యక్తి పికప్ వాహనంలో 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా కుశ్నపల్లి సమీపంలో పక్కాసమాచారం మేరకు పట్టుకున్నామని తెలిపారు. వాహనాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బెజ్జూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులగూడ గ్రామంలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కోర్తే ప్రవీణ్ కుటుంబ సభ్యులు పత్తి ఏరివేతకు వెళ్లగా 10గంటల ప్రాంతంలో ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. ఇంట్లో నిల్వ ఉన్న 10క్వింటాళ్ల పత్తి కాలి బూడిదయింది. ఇంట్లోని బీరువాలో ఉన్న పత్రాలు, బట్టలు తదితర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల ప్రజలు బిందెలతో నీళ్ల పోసి మంటలను ఆర్పేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కాగా ఎస్సై ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ భూమేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

చికెన్ వ్యర్థాల కాల్చివేతతో ఇబ్బందులు

కాసిపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాసిపేటలోని ఇండ్ల సమీపంలో చికెన్ సెంటర్ నిర్వాహకులు చికెన్ వ్యర్థాలు కాల్చివేయడంతో అందులో నుంచి వెలువడే దుర్గంధంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వ్యాధులతో ఇబ్బందులు బాధపడుతున్నట్లు స్థానికులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి ఇండ్ల వద్ద కాల్చకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

దండేపల్లి,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): దండేపల్లి గ్రామానికి చెందిన వేమునూరి కమల అనే నిరుపేద కుటుంబానికి దండేపల్లి చెందిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులను అందజేశారు. రెండు నెలల సరిపడా సరుకులతో పాటు 25 కేజీ బియ్యం బస్తాను అందజేశారు. అమ్మ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కట్ట వెంకటేష్, అధ్యక్షకార్యదర్శు చెన్నవేని బానుప్రసాద్, అల్లంల కుమారస్వామి, ముఖ్య సలహాదారులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్‌లు

హాజీపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల లయన్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లి ఆధ్వర్యంలో వేంపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రెండు రోజుల క్రితం కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రిలో 35 మందికి ఆపరేషన్‌లు చేయించగా శనివారం వారిని బస్సులో వారి ఇండ్ల వద్ద దింపారు. క్యాంపు ఛైర్మన్ డేగ బాపు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సేవలను గ్రామీణ ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అంధత్వ నివారణ లక్ష్యంగా లయన్స్‌క్లబ్ ముందుకు వెళ్తుందన్నారు. సభ్యులు బాల్ మోహన్, రాకేష్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి,వినయ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పిండి గిర్నీ ధరలు పెంచుతాం

మందమర్రిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల, పట్టణ వ్యాప్తంగా పిండి గిర్నీ ధరలను పెంచుతున్నామని యజమానులు శనివారం తెలిపారు. ఫ్లోర్ మిల్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు సల్వాద్రి శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి బోగె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. 4 ఏండ్ల కిందట పెంచిన రేట్లను ఇప్పటికీ అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 20 నుంచి కొత్త రేట్లు అమలులోకి వస్తాయని, ప్రజలు సహకరించాలని కోరారు. నాయకులు చంద్రమౌళి, శ్రీనివాస్, జహీర్, వీరభద్రచారి, రంగసాయికృష్ణ, అజీముద్దీన్, రియాజ్,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

నస్పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ కాలనీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవా సమితి శనివారం రాత్రి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. గట్టు ప్రమోద్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు గురుస్వామిచే పడిపూజ నిర్వహించారు. మధ్యాహ్నం కొక్కిరాల రఘుపతి రావు చారిట్రబుల్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ఆధ్వర్యంలో స్వాములకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ స్వామి వారిని దర్శించుకొని భిక్షను వండించారు. రాత్రి 7 గంటలకు నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి వేంకటేశ్వర ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప పాటలు, భజన, అయ్యప్ప స్వామి నామస్మరణతో ప్రాంతమంతా మారుమోగింది.

అత్యవసరానికి అవస్థలు



- మండలానికి మంజూరు కాని 108 వాహనం
- రోగులకు తప్పని తిప్పలు
- ప్రైవేటు వాహనాలే దిక్కు

పెంచికలపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో, ఆపదలో ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన 108అంబులెన్స్ వాహనసేవలు అందక గ్రామీణప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలకు గురైన బాధితులకు, ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులను స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించేందుకు 108వాహనం లేక పెంచికలపేల మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా ప్రతి మండలానికి ఒక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఉచిత అంబులెన్స్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుంది. పెంచికలపేట మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా పదివేల జనాభా ఉంది. ఆయాగ్రామాల్లోని ప్రజలు ప్రమాదాలు సంభించినప్పుడు అనారోగ్యానికి గురైనప్పుడు వారిని ఆసుపత్రికి తరలించేందుకు పక్క మండలాల 108 వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. అదే సమయంలో ఆ వాహనం అందుబాటులో ఉండొచ్చు, ఉండకపోవచ్చు, ఒకవేళ వాహనం అందుబాటులో లేనప్పుడు ప్రజల ప్రాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108వాహనం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటువాహనాల్లో ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు వాహన యజమానులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలానికి 108అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లోగుట్టు ఏమిటీ?

నూతనంగా ఏర్పడ్డ కుమరం భీం జిల్లాలో పెంచికలపేట, చింతలమానేపల్లి, లింగాపూర్ మూడు నూతన మండలాలుగా ఏర్పడ్డాయి. చింతలమానేపల్లి, లింగాపూర్ మండలాలకు 108 అంబులెన్స్ వాహనాలను అందజేసి ప్రారంభించారు. పెంచికలపేట మండలానికి రాకపోవడంపై లోగుట్టు ఏమిటో అధికారులకే తెలియాలి. ఇక్కడికి మంజూరైన వాహనాన్ని వేరేజిల్లాకు తరలించినట్లు కూడా చర్చ జరుగుతోంది. అయితే సంబంధిత అధికారులు మాత్రం పెంచికలపేట మండలానికి 108వాహనం మంజూరు కాలేదని చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

సతీష్, 108 వాహనాల జిల్లా సమన్వయ కర్త



పెంచికలపేట, ఇంతలమానేపల్లి, లింగాపూర్ మండలాలకు 108వాహనాలు ఏర్పాటు కోసం ప్రతి పాదనలు పంపించాం. అయితే రెండు మండలాలకు మాత్రమే వాహనం మంజూరైంది. పెంచికలపేటకు మంజూరు కాలేదు. మళ్లీ ప్రతిపాదనలు పంపించాలి. త్వరలోనే అంబులెన్స్ వచ్చే అవకాశం ఉంది.


పెంచికలపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న భూక్యరాజు

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్‌పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు భూక్యరాజు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జీగా కొట్నాకకిషన్‌ను నియమించామన్నారు. గ్రామగ్రామనపార్టీ బలోపేతానికి కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు సిరాజ్, వెంకన్న, ముబాషిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ

గోదావరిఖని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు నిర్ణయించే బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో కనీస వేతనాల మండలిని నియమించారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. మళ్లీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతన మండలి ఛైర్మన్‌ను నియమించింది కానీ సభ్యులను నియమించకుండా కాలయాపన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతన సవరణ చట్టానికి అనుగుణంగా జీవోలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు మాత్రమే స్థానం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, అశోక్, చిలుక శంకర్, దుర్గయ్య, రవికుమార్, సాంబయ్య, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

సమాజ విలువలు పెంపొందించేందుకే కవితలు

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 14 (ఆంధ్రజ్యోతి) : సమాజ విలువలు పెంపొందించేందుకు కవితల సారాంశం ఎంతోగానో ఉపయోగపడుతుందని సినీ గేయరచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెరంబదూర్ లింబగిరిస్వామి రచించిన 'నిశ్శబ్ద యుద్ధం' కవితా సంపుటిని శనివారం మెట్‌పల్లి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలచేసి సభకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాధలు, వారికి జరిగేఅన్యాయాలు, దోపిడీ అణిచివేతలను ఎదుర్కొని సమాజవిలువలు పెంపొందించే విధంగా నిశ్శబ్ద యుద్ధం కవితా సంపుటిలో అక్షరబద్ధం చేశారన్నారు. ప్రతిహృదయంలో సాహిత్యం వెల్లివిరియాలనిఆయన ఆకాంక్షించారు. అనంతరం సుద్దాలఅశోక్‌తే జనుకవులు, అభిమానులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

గ్రూపు-4 పరీక్షలకు నిమిషం నిబంధన

- ఆలస్యం.. నిమిషం.. విషం!
- నిరుద్యోగులు ప్రణాళిక చేసుకోవాలి
- సాంకేతికత వినియోగించుకోవాలి
- సమయపాలన పాటించాలి



వాంకిడి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే దశలో తుపాను ధాటికి పంట నష్టమైతే రైతుకు ఎంతదుఃఖం ఉంటుందో.. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా సంవత్సరాల పాటు రాత్రింబవళ్ళు చదివి పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వెళ్లడంతో పరీక్ష రాయకపోతే అభ్యర్థికి కూడా అలానే ఉంటుంది. సమయపాలన పాటించక నిర్లక్ష్యంతో కొందరు దూరమైతే, ప్రయాణంలో కలిగే అవాంతరాలతో మరికొందరు ఆలస్యమై వెనుదిరుగుతుంటారు. నెలల పాటు పుస్తకాలేలోకంగా చదివి నిమిషం ఆలస్యం కావడంతో పరీక్ష రాయని అభ్యర్థులను ఇటీవల ప్రభుత్వం నిర్వహించినగ్రూప్-4, గ్రూప్-3 పరీక్షకేంద్రాల వద్దచూశాం. చదివేటప్పుడు ఉండే సహనం, ప్రణాళిక పరీక్షకేంద్రాలకు వెళ్లేటప్పుడు ఉండకపోవడం ఆలోచించ దగిన విషయం. గత నవంబరు నెల 17న జరిగిన గ్రూప్-3 పరీక్షల్లోను నిర్ణీత సమయానికి రాలేక నిమిషం ఆలస్యంగా రావడంతో పలురువు అభ్యర్థులును అధికారులు అనుమ తించలేదు.

- ప్రణాళిక వేసుకోవాలి..

అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే రవాణా పరంగా ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇప్పుడున్న ఆధునిక యుగంలో పరీక్షకేంద్రం ఎక్కడఉందో సెల్‌ఫోన్‌లో ముందుగానే గుర్తించవచ్చు. అభ్యర్థి ఉన్న చోటునుంచి కేంద్రానికి వెళ్లాలంటే ఎంతసమయం పడుతుందో ఆన్‌లైన్‌లో చూడవచ్చు. ప్రతి ఒక్కరికి ద్విచక్రవాహనాలు అందుబాటులో ఉన్నాయి. పరీక్షకేంద్రానికి ముందే చేరుకునేలా ప్రయాణం కొనసాగిస్తే మార్గమధ్యలో ఏమైనా అవాంతరాలు ఎదురైనా.. సరైన సమయానికి పరీక్షకేంద్రానికి వెళ్లొచ్చు. ఇప్పటికైనా అభ్యర్థులు ఆదివారం జరిగే గ్రూప్2 పరీక్షకు గంట ముందు గానే ప్రణాళికలు వేసుకుంటే ఇలాంటి ఘటనలు పునరా వృతం కావు. ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంతోపాటు కాగజ్‌నగర్‌లో పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు ప్రణాళికలు చేసి, సాంకేతికతను ఉపయోగించి సరైన సమయానికి పరీక్ష కేంద్రానికి వెళ్లాలి.

న్యూస్ బాక్స్

ప్రారంభమైన యూనిఫాం డైట్ మెనూ ప్రోగ్రాం

వాంకిడి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫాం డైట్ మెనూ ప్రోగ్రాంను అధికారులు శనివారం ప్రారంభించారు. మండలంలోని ఆశ్రమపాఠశాలలు, వసతిగృహాలకు ఆహారకమిటీలను నియమించారు. వాంకిడి గిరిజన బాలికలఆశ్రమ పాఠశాలకు అదనపుకలెక్టర్ దీపక్ తివారి, బంబార గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు తహసీల్దార్ రియాజ్‌అలీ, చౌపన్‌గూడ ఆశ్రమ పాఠశాలకు ఎంఈవో శివచరణ్‌కుమార్, వెలిగి ఆశ్రమ పాఠశాలకు నాయబ్ తహసీల్దార్ దుర్గం శ్రావణ్, బీసీ బాలుర వసతిగృహానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సీ బాలుర వసతిగృహానికి ఎంపీవో ఖాజా అజీజోద్దీన్‌ను ఆహార కమిటీఛైర్మన్‌లుగా నియమించారు. శనివారం వీరి ఆధ్వర్యంలో డైట్‌మెనూ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం పెంచిన కాస్మోటిక్ చార్జీలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలను అధికారులు పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రెబ్బెన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఇందిరానగర్‌లో గోలేటి స్పోర్ట్స్ లయన్స్ క్లబ్, కాగజ్‌నగర్ డెంటల్ ఆసుపత్రి సహకారంతో దేవర వినోద్‌స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచితకంటి, దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కంటిఆపరేషన్లు అవసరమైన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో దేవర వినోద్, జోనల్ ఛైర్మన్ రైతు వెంకటేషం, గోలేటి స్పోర్ట్స్ లయన్స్ క్లబ్ కార్యదర్శి అన్న రమేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 6.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శనివారం సిర్పూర్(యు) మండలంలో 6.7డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. కెరమెరిలో 8.5, ఆసిఫాబాద్‌లో 10.5, తిర్యాణిలో 10.7డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు ఏజెన్సీ మండలాలు గజగజలాడుతున్నాయి.

మంచిర్యాల: జిల్లాలోని కన్నెపల్లి మండలంలో 12.2డిగ్రీలు, జైపూర్ మండలం కుందారంలో 12.4 డిగ్రీలు, నెన్నెల మండలంలో 12.5 డిగ్రీలు, దండేపల్లి మండలం వెల్గనూరు గ్రామంలో 12.5 డిగ్రీలు, హాజీపూర్ మండలంలో 12.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం వేలాదిభక్తులతో సందడిగా మారింది. వివిధప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, ఇతర పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు

● రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గల ఉపఆలయం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం నుంచి నెల రోజుల పాటు ధనుర్మాసఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణరావు తెలిపారు.



ప్రమాదాల నివారణకు కృషి చేయాలి


ఎస్‌ఆర్‌పీ 3 గనిలో కార్మికులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతీఉద్యోగి కృషి చేయాలని బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, శ్రీరాంపూర్ జీఎంఎల్‌వి సూర్య నారాయణ, జీఎం(ఐఅండ్‌పీఎం) బత్తుల శ్రీనివాసరావు అన్నారు. రక్షణవారోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్‌ఆర్పీ3,3ఏ గనిని సందర్శించి రక్షణ తనిఖీలు చేపట్టారు. ఎస్‌వోపీ, ఎస్‌ఎంపీలను తప్పక పాటించాలన్నారు. అనంతరం రక్షణ పరీక్షల్లోనెగ్గిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏజెంట్ వెంకటేశ్వర్లు, గనిమేనేజర్ వెంకట్ రావు పాల్గొన్నారు.

ఆర్కే5 గనిలో: రక్షణ బృందం కన్వీనర్, జీఎం (పర్యావరణం) బానోత్ సైదులు ఆధ్వర్యంలో ఆర్కే 5 గనిని తనిఖీచేశారు. రక్షణ ఏర్పాట్లపై వారుసంతృప్తి వ్యక్తంచేశారు. విధుల్లో తప్పనిసరిగా రక్షణసూత్రాలు పాటించాలనిసూచించారు. కార్యక్రమంలో రక్షణకమిటీ సభ్యులు కట్టాశ్రీధర్,రాధాకృష్ణ, దామోదర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం తనిఖీ

శ్రీరాంపూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణశిబిరాన్ని ఇన్‌చార్జి డీజీఎంరాజేశ్వర్ తనిఖీచేశారు. అనంతరం మాట్లాడుతూ, వాలీబాల్ క్రీడాకారులు కోల్ ఇండియాలో విజయం సాధించి సింగరేణిసంస్థకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పీవో కాంతారావు, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్, వాలీబాల్ కెప్టెన్ చిన్నయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

శ్రీరాంపూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్‌లోని ప్రగతిమైదానంలో మహిళలు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించారు. బాంబ్ బ్లాస్ట్, టగ్‌వార్, త్రోబాల్, 50మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు. ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని ఇన్‌చార్జి డీజీఎం రాజేశ్వర్ తెలిపారు.

సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలి

రెబ్బెన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అభివృద్ధికి అంతా కృషి చేయాలని జీఎం శ్రీనివాస్‌అన్నారు. శనివారం రెబ్బెన సీఎస్పీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది, ఉద్యోగులు రక్షణతో కూడిన విధులు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా ఉత్పత్తి, ఉత్పాదకత గురించి అందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం కెరాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, డీజేవైఎం ఎడీ ఉజ్వల్ బెహారా తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తొలగించిన డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కన్వేయన్స్ డ్రైవర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు కాజీపేట రాజేశం అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఓసీపీలో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మందమర్రి డివిజన్ పరిధిలోని ఏరియా వర్క్‌షాప్‌లో కన్వేయన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సంతోష్‌ను టెండర్ మారిందనే నెపంతో విధుల నుంచి తొలగించడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి అతన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సతీష్, సురేష్, రాజకుమార్, సల్లూరి సురేష్, వినయ్, మల్లేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోని నాయకులు

శ్రీరాంపూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎస్‌ఆర్పీ3 గనిలో కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధానకార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు దేవిసత్యనారాయణ, బెల్లంపల్లి రీజియన్‌కార్యదర్శి సమ్ము రాజయ్య మాట్లాడుతూ, సింగరేణిలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీ యూసీలు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచి కార్మికులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని కార్మికవర్గం గుర్తించి, భవిష్యత్తులో తగిన బుద్ధి చెప్పాలని వారు కోరారు.

ఆవిర్భావ వేడుకలకు ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో ప్రదర్శన ఇచ్చేందుకు సింగరేణి, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సీసీసీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. 15 పాఠశాలలకు చెందిన 340మంది పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) ఎ రాజేశ్వర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిక కమిటీ సభ్యులు పి. కాంతారావు, శ్యాంసుందర్, కమ్యూనికేషన్ కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక


దినేష్

హాజీపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఫలితాల్లో ముల్కల్ల గ్రామానికి చెందిన సందెల దినేష్ అనే యువకుడు ఉద్యోగం సాధించాడు. బీటెక్ పూర్తి చేసిన దినేష్ కాంపిటేటివ్ ఉద్యోగాలకు రెండు సంవత్సరాల నుంచి ప్రిపేర్ అవుతున్నాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఉద్యోగం సాధించిన దినేష్‌ను పలువురు అభినందించారు.

బీఎస్ఎఫ్ జవాన్ ఉద్యోగం సాధించిన యువతి


సుప్రియ

కన్నెపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బెన గ్రామానికి చెందిన పోతుగంటి సుప్రియ బీఎస్ఎఫ్ జవాన్‌గా ఉద్యోగం సాధించింది. బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపిక కావడంతో ప్రజలు, బంధువులు, కుటుంబీకులు ఆమెను అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

తాండూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రేచిని గ్రామంలోని సంతాన దత్త సహిత శివకేశవ ఆలయంలో శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని, లలిత దత్త ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. విశ్వనాథ గురుపీఠం ఆధ్వర్యంలో సుబ్బ దత్తమూర్తి భాగ్యలక్ష్మీ దంపతుల సమక్షంలో పూజలు నిర్వహించారు. లలిత సహస్రనామ పారాయణం, అగ్నిముఖం, పూర్వశాంతి హవనం, గణపతి పూజ, పుణ్యాహవచనం పూజలను నిర్వహించారు.

ఘనంగా నవగ్రహ పూజ

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది తీరంలోని గౌతమేశ్వర ఆలయం ఆవరణలో నిర్మించిన నవగ్రహాలకు శనివారం మండల పూజ కార్యక్రమాన్ని అర్చకులు గడియారం బాలాజీశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. నవగ్రహాలను ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా హోమం నిర్వహించారు. అంతకు ముందు కలశ స్థాపన, గణపతి పూజ, హోమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు దత్త పౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు వానమభట్ల బాలకృష్ణ శర్మ గంగా హారతి చేపట్టారు. ఆలయంలో వెన్నెల పారాయణం, లలిత, విష్ణు సహస్ర పారాయణాలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గోపగాని శ్రీదేవి, ఈవో ముక్త రవి పాల్గొన్నారు.


కొండాపూర్ గ్రామ శివారులో ధర్మరాజుల గుట్ట

గుట్టల మాటున పాండవుల చరిత్ర

- కొండాపూర్-నర్సాపూర్ గ్రామాల మధ్య గుట్టలు
- ధర్మరాజు, రచ్చగుట్టలుగా వాడుకలో...
- దృష్టి సారించని పురావస్తు శాఖ

దండేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నర్సాపూర్-కొండాపూర్ గ్రామాల మధ్య గల గుట్టల్లో పాండవుల చరిత్ర దాగి ఉంది. స్థానికులు అ గుట్టలను ధర్మరాజు గుట్ట, రచ్చగుట్ట అని పిలుస్తారు. ఈ గుట్టలపై గతంలో కొందరు క్వారీ వ్యాపారుల కన్ను పడింది. వ్యాపారులకు కలిసి రాక ప్రారంభంలోనే తవ్వకాలను వదిలేశారు. పురావస్తు శాఖ దృష్టి సారిస్తే ఇక్కడ అనేక చారిత్రక ఆనవాళ్లు బయటపడనున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో నర్సాపూర్-కొండాపూర్ గ్రామాల మధ్య రెండు గుట్టలున్నాయి. అందులో ఒకదానిని ధర్మరాజుల గుట్ట, మరో దానిని రచ్చ (రాక్షసుల) గుట్టగా పిలుస్తారు.

రచ్చ (రాక్షసుల) గుట్ట..

ధర్మరాజుల గుట్టకు సమీపంలో మరో గుట్ట ఉంది. దానిని రచ్చ(రాక్షసుల)గుట్ట అని పిలుస్తారు. ఈ గుట్ట పైన రాక్షసులు నివాసం ఉంటే వారిని పాండవులు తరిమేశారని చెబుతుంటారు. అందులో గిల్లి కర్ర(చిరగోనే)ఆటకు సంబంధించిన ఆనవాళ్లు ఉండేవని, కొందరు కంకర కోసం రాయిని పగుల కొట్టడంతో కనుమరుగయ్యాయని చెబుతారు.

కోర్కెలు తీర్చే దేవుడు...


ధర్మరాజుల గుట్ట వద్ద గల దేవుళ్ల భక్తుల కోర్కెలు తీరుస్తాయని ప్రజలు నమ్ముతారు. వర్షాలు సకాలంలో కురవక పోతే ప్రజలు ఇక్కడకు వచ్చి పూజలు నిర్వహించడంతో పాటు మేకలు, కోళ్లను బలి ఇస్తే వర్షాలు కురుస్తాయని ఇక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. పూజలతో పాటు కొందరు పిల్లల పుట్టు వెంట్రుకలు కూడా ఇక్కడ తీస్తారు.

వర్షాల కోసం ప్రత్యేక పూజలు..

గుట్ట కింద నెలకొల్పిన విగ్రహాలకు పూజలు నిర్వహించడంతో పాటు వర్షాలు సకాలంలో కురువక పోతే డప్పుల చప్పుళ్లతో గుట్ట వరకు వచ్చి విగ్రహాలను సమీప గ్రామాలకు ఊరేగింపుగా తీసుకెళతారు. గ్రామ పొలిమేరలో వాటిని పెట్టి వర్షాలు కురిసే వరకు పూజలు నిర్వహిస్తారు. అనంతరం మళ్లీ విగ్రహాలను గుట్ట వద్ద తెచ్చి పెడతారు. సమీప గ్రామాల ప్రజలు తమ ఆరాధ్య దైవంగా భావిస్తూ యేటా మొక్కులు చెల్లించుకుంటారు.

ధర్మరాజుల గుట్టలో పాండవుల నివాసంగా..

ధర్మరాజుల గుట్టగా పిలిచే గుట్టపై పాండవులు నివసించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ గుట్టపైన పెద్ద గుహ ఉంది. అందులో మట్టితో తయారు చేసిన గుర్రాలు, దేవుళ్ల ప్రతిమలు కనిపిస్తాయి. ఇంకా లోనికి ఎవరూ వెళ్ళలేదు. గుట్టపైకి వెళ్ళడానికి ప్రజలకు ఇబ్బందిగా ఉండడంతో గిరిజన పూజారులు కొన్ని విగ్రహాలను గుట్ట కింద నెలకొల్పారు. సమీప ప్రజలు గుట్ట కింద నెలకొల్పిన విగ్రహాలకు ప్రతీ గురు, ఆదివారాల్లో పూజలు నిర్వహిస్తారు.


ధర్మరాజుల గుట్ట గుహ లోపల విగ్రహ ప్రతిమలు

ధర్మరాజును దర్శించుకుంటే సకల సంపదలు

మేకల పోచన్న పూజారి కొండాపూర్



ధర్మరాజుల గుట్టను భక్తులు దర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తే సకల సంపదలు కలుగుతాయి. కొందరు ధర్మరాజును ఇలవేల్పుగా పూజిస్తారు. వారి పిల్లలకు ఇక్కడ కేశఖండనం చేస్తారు. ఇక్కడ పూజలు చేస్తే కరువు కాటకాలు రాకుండా సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని భక్తులు నమ్ముతారు.

కోర్కెలు తీర్చే దేవుడు

ఇప్ప భూమయ్య రైతు కొండాపూర్



ధర్మరాజుల గుట్ట వద్ద గల దేవుళ్ల భక్తుల కోర్కెలు తీరుస్తాయి. సకాలంలో వర్షాలు కురవక పోతే ప్రజలు ఇక్కడకు వచ్చి పూజలు చేసి మేకలు, కోళ్లను బలి ఇస్తారు. కొందరు పిల్లల పుట్టు వెంట్రుకలు కూడా ఇక్కడ తీస్తారు.

ఊపందుకున్న పనులు

5వ పేజీ తరువాయి

కిరాయికి ఉండేవారి కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని యజమానులు ఇంట్లోకి అనుమతించడం లేదు. దహన కార్యక్రమాల అనంతరం కర్మలు పూర్తయ్యే వరకు వారిని యజమానులు ఇళ్లలోకి రానివ్వడం లేదు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శ్మశాన వాటిక నిర్మాణంలో వారికి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. వారి కోసం ప్రత్యేకంగా గదుల నిర్మాణం చేపడుతున్నారు. ఆ గదుల్లో కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ఉండేలా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. హిందూ మతస్థులు దహన సంస్కారాలు, కర్మ కాండల కోసం దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు నూతనంగా నిర్మించే శ్మశాన వాటికతో తొలగిపోనున్నాయి.

ప్రజల సౌకర్యం కోసమే వైకుంఠధామం నిర్మాణం

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ ప్రజల సౌకర్యార్థం వైకుంఠధామం ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రైవేట్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని గోదావరి నది తీరంలో వైకుంఠధామం ఏర్పాటుకు 4 ఎకరాల్లో పనులు ప్రారంభించామన్నారు. వైకుంఠధామం నమూనాను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు.

సత్యదేవున్ని దర్శించుకున్న దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్


చైర్మన్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో శ్రీనివాస్, అర్చకులు

దండేపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానంలో హైదరాబాద్ దేవాదాయ ధర్మాదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్ వెంకటేశ్వర్లు శనివారం సత్యదేవున్ని దర్శించుకొన్నారు. ఆయనకు ప్రధాన ఆలయం వరకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచనలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, వేదపండితులు దుద్దుళ్ల నారాయణశర్మ, భరత్‌శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిపై ఫిర్యాదు

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రవూఫ్‌ఖాన్‌పై శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ పనిచేసిన సమయంలో దివ్యాంగుల పట్ల దురుసుగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యారని, తిరిగి పోస్టింగ్ ఇవ్వడం సరైంది కాదని విన్నవించారు. పెద్దపల్లి సత్యనారాయణ, నరేష్, రమేష్, పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు అండగా ఉండాలి


నిత్యావసర సరుకులు అందిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనాథ విద్యార్థులకు ప్రతీ ఒక్కరు అండగా ఉండాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ ఆధ్వర్యంలో రాంజీగోండు అనాథ నిలయంలో సీఎస్ఆర్ నిధులు రూ. 2.60 లక్షల విలువ గల సరుకులను శనివారం ఆర్డీవో చేతుల మీదుగా నిర్వహకులకు అందజేశారు.

ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సరుకులను ఓరియంట్ సిమెంటు కంపెనీ అందించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఏజీ ఎం హెచ్ఆర్ ఉమా శంకర్, లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి, వెల్ఫేర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఎండీ జాఫర్ పేర్కొన్నారు. శనివారం కేజీబీవీ పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, బీమా, వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. ఏఎన్ఎంలకు నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అరుణ, స్వర్ణలత, తిరుమల, రాజేశ్వరి పాల్గొన్నారు.

డీటీడీవోను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

చెన్నూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడీవో)ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులు గౌరవించి ప్రభుత్వం వెంటనే డీటీడీవో గంగాధర్ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కోటపల్లి మండలం కొత్తపల్లిలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములను ప్రభుత్వం సింగరేణి సంస్థకు అప్పగించే ప్రయత్నం చేయడాన్ని విరమించుకోవాలన్నారు.

జిల్లా కేంద్రంలో ఆదివాసీ భవనానికి భూమి కేటాయించి భవన నిర్మాణం చేపట్టా లన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద కొము రంభీం విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీల మనుగడను కాపాడాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గండి రమేష్, కోశాధికారి పెద్దల వెంకటేష్, నాయకులు చెడెంక మాంతయ్య జైలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మానందం, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 9 రోజులుగా సమస్యలను పరిష్కరించాలని దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలని,వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సురేందర్, అరుణ, జాఫర్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

కురుమ కులస్తుల హక్కుల సాధనే లక్ష్యం


ర్యాలీగా నిర్వహిస్తున్న కురుమ సంఘం నాయకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కురుమ కులస్తుల హక్కుల సాధనే లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం యాదవ్ అన్నారు. శనివారం సింగరేణి పాఠశాల మైదానంలో కురుమ సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలో కురుమల సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో కురుమ ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఏనుగుల బీరయ్య, శ్రీనివాస్, కొండ మధు, రంజిత్, వెంకటేష్, చంద్రశేఖర్, శ్యాం పాల్గొన్నారు.

హైద్రాబాద్‌కు తరలిన నాయకులు

తాండూర్, (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మ గౌరవ భవన ప్రారంభోత్సవానికి మండలం కొత్తపల్లి గ్రామం నుంచి కురుమ సంఘం నాయకులు తరలి వెళ్లారు. అన్నలం మల్లేష్, రాజ్‌కుమార్, ఐలయ్య, పర్వతాలు, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

టైగర్‌జోన్‌లో పర్యటించిన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అడిషనల్ జడ్జి



కుటుంబ సభ్యులతో హైద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు అడిషనల్ జడ్జి వెంకటేశ్వర్‌రావు

జన్నారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు అడిషనల్ జడ్జి వెంకటేశ్వర్‌రావు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కవ్వాల్ టైగర్ జోన్‌లో పర్యటించారు. జంగల్ సఫారీ వాహనంలో పర్యటిస్తూ అడవిలోని జంతువులను, పక్షులను వీక్షించారు. టైగర్ జోన్‌లో జంతువులకు ఏర్పాటు చేసిన గ్రాస్ ల్యాండ్‌ను పరిశీలించారు. వన్యప్రాణులు, అడవి సంరక్షణపై చేపట్టిన అభివృద్ధి పనులను ఫారెస్టు అధికారులు ఆయనకు వివరించారు. ఎఫ్‌బీవో శ్రీనివాస్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

గర్మిళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీసీపీ భాస్కర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులోని పోస్టుమెట్రిక్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన రుచికరమైన ఆహారం అందించడానికి కామన్ మెనూ అమలు చేస్తోందన్నారు. నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సూచించారు. సాయికుంట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం వండడంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బుక్కా వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జ్యోతి, రేణుక, లక్ష్మీమహేశ్వరి, పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని డీఎఫ్‌వో ఆశిష్‌సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనశాల, వసతి గృహం, లైబ్రరీ, గురుకుల పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఎఫ్ఆర్‌వో రత్నాకర్ , వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, కమలాకర్, కార్యదర్శి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం బీసీ బాలికల హాస్టల్‌లో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం చార్జీలను పెంచిందని, నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు సాంస్కృతిక


బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్, బాయ్స్ హాస్టల్‌లో భోజనం చేస్తున్న డీసీపీ భాస్కర్

కార్యక్రమాలను నిర్వహించారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి భాగ్యవతి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సునీతరెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో కామన్ డైట్ ప్లాన్‌ను ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. కూరగాయలు, వంటసరుకులు, బియ్యం పరిశీలించారు. పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉంచాలని, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. వార్డెన్ జయశంకర్ పాల్గొన్నారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో ఎంపీడీవో లక్ష్మయ్యతో కలిసి కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, అలాగే కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం అశోక్, వయోజన విద్యా డీఆర్‌పీ అశోక్, ఉపాధ్యాయులు లావణ్య, కొమురెల్లి మధునయ్య, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే అన్నారు. గుడిపేటలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ముల్కల్ల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్ కామన్ డైట్ మెనూను ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కళాశాలలో నూతన కామన్ డైట్ మెనును ఆర్డీవో హరికృష్ణ ప్రారంభించారు. రోజు విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): కవ్వాల హాస్టల్ తండాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి కామన్ డైట్ మెనూను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు మెనుప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో అదనపు కలెక్టర్ మోతిలాల్ కామన్ డైట్ మెనును ప్రారంభించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో శశికళ, జిల్లా వెనకడిన తరగతుల అధికారి వినోద్‌కుమార్, అధికారులు రమేష్, విజయ్ కుమార్, అనసూయ, పాల్గొన్నారు.

భీమారం,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ సదానందం పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పోషకాహార విలువలతో కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు కామన్ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని జిల్లా దళిత అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలలో కామన్ మెనూను ఎంపీడీవో ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. భోజనం, అల్పాహారాన్ని వసతి గృహ అధికారులు, సిబ్బంది ముందుగా తినాలన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతి బాపూలే, బీసీ గురుకుల బాలుర పాఠశాలలో కామన్ డైట్ మెనూను మండల ప్రత్యేకాధికారి అంజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌లు ప్రారంభించారు. వంట గది, సరుకులు నిల్వ చేసే గది, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.


గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో ఆశిష్‌సింగ్

- కనీస సదుపాయాలు కరువు
- గద్దెలు లేక వ్యాపారస్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు
- ఏళ్లుగా ఇదే తంతు

వారసంతలపై పట్టింపేది?



బెజ్జూరు సంతలో వర్షంలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు(ఫైల్)

బెజ్జూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో నిర్వహించే వారసంతలను పట్టించుకున్న నాథుడే లేడు. ఏళ్లుగా వారసంతల్లో మౌళిక వస తులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వర్షా కాలంలోనైతే ఇబ్బందులు చెప్పనలవి కావని వాపోతు న్నారు. భారీ వానలు కురిసిన సమయంలో సంతకు తీసుకవచ్చిన సరుకులు పూర్తిగా వర్షంలో తడిసిపోతు న్నాయని ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా వారసంతల్లోనే ప్రజలు వివిధ రకాల సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు. కానీ వారసంతల్లో కనీస సదుపాయాలు లేక క్రయవిక్రయదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఆదాయం ఉన్నా సౌకర్యాలు సున్నా..

గ్రామాల్లో నిర్వహించే వారసంతలకు పల్లెటూరి సూపర్‌మార్కెట్లుగా పేరుంది. గ్రామాల్లో నిర్వహించే వారసంతల్లో గుండుసూది నుంచి అన్నిరకాల సామగ్రి, కూరగాయలు, బట్టలు, పిల్లల ఆటలాడే వస్తువులు, వివాహాలకు సంబంధించిన సామగ్రి ఒకే చోట లభ్యమవుతుంటాయి. వారసంతల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. ఏడాదికి సంతలను బట్టి లక్షలు సమకూరుతున్నాయి. వారసంతలకు ఆదాయం లక్షల్లో ఉన్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో నేలపైనే కూర్చొని క్రయవిక్రయాలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో పెద్దఎత్తున వారసంత జరుగుతుంది. ఈ సంతల్లో లక్షల్లో రూపయల్లో వ్యాపారాలు జరుగుతాయి. మిగితా మండలాల్లో సైతం ప్రతీవారం ఏదో ఒకరోజున వారసంత జరుగుతుంది. కొన్ని గ్రామాల్లో మాత్రం ప్రధాన రోడ్డుపైనే వారసంతలు జరుగుతాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రఆటంకం ఏర్పడుతుంది. అయినా అధికారులు ఆదాయంపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు తప్ప సదుపాయాలపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడం గమనార్హం.

సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం..
- దాగామ పార్వతి, కూరగాయల వ్యాపారి, బెజ్జూరు



వారసంతల్లో సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలోనైతే సంతా అంతా బురదమయం అవుతుంది. వారసంతల ద్వారా వచ్చే ఆదాయం గడించడమే తప్ప కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. గ్రామపంచాయతీ అధికారులు ఇకనైనా సంతలో సౌకర్యాలపై దృష్టిసారించాలి.

వర్షం పడితే అంతే..

ప్రతీ ఏటా వర్షాకాలంలో వ్యాపారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. సంతల్లో వ్యాపారులు కూర్చుకు నేందుకు సరైన వసతులు, గద్దెలు లేక వ్యాపారాలు నేలపైనే కొనసాగి స్తున్నారు. వర్షం కురిస్తే వారికష్టాలు అన్నీఇన్నీ కావు. సంతలో అమ్మ కానికి తెచ్చిన వస్తువులు వర్షానికి పూర్తిగా తడిసి పాడైపోతు న్నాయని వాపోతున్నారు. అదేవిధంగా నేలపైనే బురదలోనే వ్యాపారాలు చేయా ల్సిన దుస్థితి ఉంటుందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వారసంతల్లో కనీస సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదవ రోజుకు చేరుకున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి మినిమం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి ఐదవ రోజుకు చేరుకుంది. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు పీఆర్టీయూ, ఎస్టీయూ, టీఎస్‌యూటీఎఫ్, తెలంగాణలెక్చరర్స్ అసోసియేషన్ సంఘాల నాయకులు శ్రీనివాస్‌రావు, అనిల్, తుకారాం, మానిక్‌రావు, సంజయ్, లక్ష్మణ్, ఊశన్న, రాజక మాలకర్‌రెడ్డి, రమేష్, హేమంత్, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి దీక్షశిబిరాన్ని సందర్శించి మద్దతుతెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ గతంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని కోరారు. సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు తుకారాం, నాగసుధ, నగేష్, సంతోష్, సందీప్, పవన్, అరుణ, మీనా, కవిత, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

శైలజ కుటుంబానికి రూ.2లక్షల చెక్కు అందజేత



విద్యార్థి కుంటుబసభ్యులకు చెక్కు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

వాంకిడి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దాబా గ్రామానికి చెందిన శైలజ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2లక్షల చెక్కును డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో పర్యటనలో భాగంగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క విద్యార్థిని శైలజ కుటుంబానికి మంజూరైన చెక్కును అందించారని అన్నారు. శైలజ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థిని తమ్ముడి చదువుకు ప్రభుత్వ పరంగా అన్నివిధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు శైలజ కుటుంబానికి రూ.1లక్ష ఆర్థికసహాయం అందించ నున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాలీసంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు గుర్నులే నారాయణ, దీపక్‌ముండే, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 14: మండలంలోని బూర్గుడ సమీపంలోని హైవేపక్కన నూతనంగా నిర్మించిన దేవాలయంలో శనివారం దారి మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నిమ్మకంటి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వ హించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావు, మాజీజడ్పీటీసీ అరిగెల లక్ష్మి అలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీజేపీనాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రత్యేకపూజల అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచులు సత్యనారాయణ, చౌదరి గోపాల్, కమిటీసభ్యులు విజయ్‌గౌడ్, పుట్టవెంకటేష్, రవికుమార్, జంజిరాల శ్రీనివాస్, వెంకటేష్, తుపాకులసత్తయ్యతదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జీ శ్యాంనాయక్

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను శనివారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గఇన్‌ఛార్జీ శ్యాంనాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆసిఫాబాద్‌మండలం బాబాపూర్ గ్రామా నికి చెందిన తిరుపతికి రూ.30వేలు, వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన బాలాజీకి రూ.60వేల చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు నిజాం, మురళీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ ఫెడరేషన్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీసేవరాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్ ఆధ్వర్యంలో శనివారం ఆసిఫాబాద్ జిల్లా మీసేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లాఅధ్యక్షుడుగా గడ్డల సురేష్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మినారాయణ, కిరణ్, కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా సంతోష్, సంయుక్త కోశాధికారిగా మాతిన్, కార్యనిర్వాహక సభ్యులుగా రాకేష్, హన్మంతు, మోహినోద్దిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జైనూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జైనూర్, సిర్పూర్(యు) మండలాల బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శనివారం మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిర్పూర్(యు) మండలానికి చెందిన మాజీ సర్పంచ్ ఆత్రం వీణబాయి, మాజీఎంపీటీసీ లక్ష్మీబాయి, పంగిడి మాజీ సర్పంచ్ ఆత్రం జాలీంషావ్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అబ్దుల్‌ముకీద్ తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్‌ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం పంపిణీ

కెరమెరి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిషాని గ్రామానికి చెందిన రైతువడావి పితాంబర్‌కు చెందిన ఎద్దు ఇటీవల పులిదాడిలో మృతిచెందింది. అటవీ శాఖ స్పందించి ఎఫ్‌ఆర్వో మజారోద్దిన్ నేతృత్వంలో శనివారం బాధిత రైతుకు రూ.పది వేల చెక్కు, అదేవిధంగా డిల్లీకి చెందిన ఎన్‌జీవో సంస్థ మరో 3వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాజీసర్పంచ్ అంబారావ్, నాయకులు సంతోష్ శంకర్, అటవీశాఖ సిబ్బంది తదితరులు ఉన్నానరు.

జోడేఘాట్ మ్యూజియానికి సందర్శకుల తాకిడి

కెరమెరి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జోడేఘాట్ మ్యూజియానికి శనివారం సందర్శకుల తాకిడి కనిపించింది. సెలవురోజు కావడంతో మంచిర్యాల జిల్లాకు చెందిన పలు ప్రైవేట్‌పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రత్యేకవాహనాల్లో వచ్చి భీం విగ్రహాన్ని, మ్యూజియంను ఆసక్తిగా తిలకించారు.

డాక్టర్ చమన్‌సింగ్‌కు అవార్డు

రెబ్బెన, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోలేటికిచెందిన డాక్టర్ చమన్‌సింగ్‌కు హ్యూమన్ రైట్ క్రూసడర్‌అవార్డు-2024కు ఎంపికయ్యారు. ఈ అవార్డురావటం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ చమన్ సింగ్ తెలిపారు. ఈ అవార్డు కూడా ఆల్టర్నేటివ్ మెడిసిన్ విభాగంలో వచ్చినట్టు తెలిపారు. గతంలో జర్మనీ యూనివర్శిటి గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించినట్లు ఆయనతెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

రెబ్బెన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి అంతా కృషిచేయాలని రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీష్ బాబు అన్నారు. శనివారం రెబ్బెనలో బూత్ కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ బలోపేతం కావాలంటే పీఎం నరేంద్రమోడి చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి తెలపాల న్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, రాష్ట్ర నాయకులు కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్లు సొల్లు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని సాంఘికసంక్షేమ బాలురగురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కామన్‌డైట్ ప్రారంభోత్సవానికి ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ఆరోగ్య, పోషకవిలువలు కలిగిన మెనూను ప్రకటించిందన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలోని 110విద్యాసంస్థల్లో ఈ కార్యక్ర మం చేపట్టామన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థు లతో కలిసి భోజనం చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడాపాఠశాలలో కామన్‌డైట్ మెనూ కార్యక్ర మాన్ని అటవీశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జ్యోతీబాపూలే బాలురుగురుకుల పాఠశాలలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి సజీవన్, డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, డీఎస్‌వో మీనారెడ్డి, జీసీడీవో శకుంతల, ఏటీడీవోలు చిరంజీవి, ఖమర్ హుస్సేన్, శ్రీనివాస్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు యాదగిరి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన అదనపు కలెక్టర్..

వాంకిడి: మండలంలోని బంబార గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల, వాంకిడి గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలను శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేకదృష్టి సారి స్తుందని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు 8సంవత్సరాల తురువాత డైట్‌చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు 200శాతం పెంచిందని తెలిపారు.

ప్రభుత్వం గురుకులాలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఆరోగ్యకరమైన పోషకవిలువలు కలిగిన మెనూ ప్రకటించిందన్నారు. ప్రతిరోజు వివిధ రకాలైన మెనూను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో 110విద్యా సంస్థ లలో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కామన్ డైట్‌చార్జీలు 3వతరగతి నుంచి 7వతరగతి వరకు విద్యార్థులకు రూ.950నుంచి రూ.1330 వరకు, 8వతరగతి నుంచి 10వతరగతి వరకు విద్యా ర్థులకు రూ.1110నుంచిరూ. 740వరకు, ఇంటర్ విద్యార్థు లకు రూ.1500 నుంచి రూ.2100 వరకు పెంచిందన్నారు. అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం భారీగా పెంచడంతో పాటు విద్యాబోధన, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకచర్యలు తీసుకుంటుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వపాఠశా లలో మౌలికసౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థులకు నాణ్య మైన విద్య అందిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కాగజ్‌నగర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆది, సోమవారాల్లో జరిగే గ్రూపు-2 పరీక్షల కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్నిఏర్పాట్లను పూర్తిచేసింది. జిల్లాలో ఆసిఫా బాద్, కాగజ్‌నగర్ పట్టణాలలో మొత్తం 18 పరీక్షకేంద్రాలను ఏర్పాటుచేయగా 4389మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఆది, సోమవారాల్లో గ్రూపు-2 అభ్యర్థులు రెండు పేపర్లకు పరీక్షలు రాయనున్నారు. పేపరు-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30గంటల వరకు పేపరు-2 పరీక్షలు జరుగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే హాజరు కావాలన్నారు. ఉదయం 9:30గంటలకు మధ్యాహ్నం 2:30గంటలకు పరీక్షకేంద్రాల గేట్లను మూసివేయనున్నారు. తర్వాతవచ్చిన అభ్యర్థులను పరీక్షకేంద్రాల్లోకి అనుమతించరు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రూపు-2 పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ 163సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతిపరీక్ష కేంద్రం ఆవరణలో సీసీ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పరీక్షకేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి పరిశీలించారు.

కాగజ్‌నగర్‌లో ఉచిత ఆటో సౌకర్యం

కాగజ్‌నగర్: ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూపు-2 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఉచిత ఆటో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బస్టాండులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. అభ్యర్థులు నేరుగా పరీక్ష కేంద్రాలకు దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లోక్ అదాలత్‌ల ద్వారానే సత్వర న్యాయం

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లతో సత్వర న్యాయం అందుతుందని జిల్లా ప్రధానన్యాయాధికారి ఎంవీ రమేష్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోర్టుఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసులను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. తద్వారా కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో మొత్తం 2964 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ, జూనియర్ సివిల్‌జడ్జి అనంతలక్ష్మి, బార్‌అసోసియేషన్ రాపర్తి రవిందర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో విద్యుదీకరణకు ప్రత్యేకచర్యలు

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో 100శాతం విద్యుదీకరణ పూర్తిచేసేందుకు ఎన్పీ డీసీఎల్ ప్రత్యేకచర్యలు తీసుకుంటుందని ఆశాఖ ఎస్ఈ వీరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల కింద ఇప్పటివరకు 514ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించామన్నారు. జిల్లాలో ఇంకా 100ఆవాసాలకు అటవీశాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందని అనుమతులు రాగానే పనులను పూర్తి చేస్తామన్నారు.

మండలాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ ప్రోగ్రాం ప్రారంభం



రెబ్బెనలో కామన్ డైట్ ప్రొగ్రాంను ప్రారంభిస్తున్న తహసిల్దార్ రాంమోహన్

రెబ్బెన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం కామన్‌డైట్ ప్రోగ్రాం తహసీల్దార్ రాంమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. వసతులుకల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులుచదివి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, ఎస్సై చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి..

బెజ్జూరు: వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని బెజ్జూరు, సోమిని, సలుగుపల్లి, కుంటలమానేపల్లి ఆశ్రమపాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తోన్న నూతనమెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనుంచి అన్నిచోట్ల ప్రభుత్వం నిర్ధేశించిన ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాస్, హెచ్‌ఎం దినకర్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో పౌష్టికాహారం..

జైనూర్: సంక్షేమ హాస్టళ్లలో చదవుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం మెనూచార్జీలను పెంచిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జైనూర్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం నూతన మెనూ అమలు చేసిన సందర్భంగా పేరేంట్స్‌కు సమావేశం నిర్వహించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. పోచంలొద్దిలో జైనూర్ సీఐ రమేష్, మెనూ భోజనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు పార్వతీబాయి, అనిత, సిడాం భీంరావ్, అరుణ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని అన్నిసంక్షేమ హాస్టళ్లలో శనివారం విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూను జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, హట్టిగిరిజన సంక్షేమ పాఠశాలలో ప్రారంభించారు. బాబేఝరి హాస్టల్‌లో ఎంపీడీవో అంజద్‌పాషా, నూతన మెనూను ప్రారంభించి విద్యార్థులు, వారితల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రానున్న పదిపరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని సూచించారు.

కౌటాల: మండలంలో మొగడ్‌ధగడ్ ఆశ్రమ పాఠశాలలో శనివారం డైట్‌చార్జీల మెనూ పోస్టర్స్ విడుదలచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుష్పలత మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి లక్ష్యాలతో చదువాలన్నారు. అలాగే ఉన్నత చదువులు చదివిజిల్లాకు మంచిపేరు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, ఎంపీడీవో ప్రసాద్ తదితరుఉ పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో శనివారం దత్తజయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు దంపతులు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం అలయంలో అన్నదానం నిర్వహించారు.

జైనూర్: మండలంలోని సంబాజీగూడలో దత్తజయంతిని శనివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రి మందిరంలో పెద్దఎత్తున భక్తులు చేరుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి నారాయణ మహరాజ్ ప్రసంగించారు. దైవ చింతనతోనే మనశ్శాంతి కల్గుతుందన్నారు.